నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, శనివారం 24 ఫిబ్రవరి 2024 | KHAMMAM

## వైభవోపేతంగా
# సహస్ర కలశవాహన సేవ


ఏకోత్తర సహస్ర కలశవాహనకు సిద్ధం చేసిన కలశాలు

భద్రాచలం, ఫిబ్రవరి 23 : మాఘమాసోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం ఏకోత్తర సహస్ర కలశవాహన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కలశాల్లో శుద్ధోదకాలు, ద్రవ్య కలశాల్లో ఆయా దేవతలను ఆవాహనం చేశారు. మరికొన్ని కలశాల్లో ఫలోదకం, ఇక్షోదకం(చెరకు రసం) కషాయోదకం, లవణోదకం, హరిద్రోదకం, వర్షోదకం, తటాకోదకం, దిగుడు బావులు, నదులు, ఉపనదుల నుంచి తీసుకొచ్చిన తీర్థాన్ని, అయోధ్యలోని సరయూ నది నుంచి తీసుకొచ్చిన తీర్థాన్ని మహాకుంభంలో ఉంచారు. ఏటా మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని సహస్ర కలశాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏకోత్తర సహస్ర కలశాభిషేకం కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ చేశారు. వేడుకలో భాగంగా స్వామివారికి ప్రతి రోజు నిర్వహించే నిత్య కల్యాణాన్ని నిలిపివేశారు. సాయంత్రం యాగశాలలో లఘుతిరువారాధన,

### నేడు కలశాభిషేకం

సహస్ర కలశాభిషేకాన్ని ఆయా దేవతలకు సంబంధించిన మంత్రాలతో హవనం ద్వారా పఠించారు. యాగశాలకు అభిముఖంగా వాస్తు పురుషుడి విగ్రహాన్ని వేసి శిరస్సు, బాహువులు, తొడలు, ఉరువులు, కుక్షి, పృష్ఠక భాగం, పాదాల వద్ద పొంగలి ముద్దలను ఉంచి పంచ రంగులతో వసంతాన్ని చల్లారు. 'భం భానవే నమః' అనే మంత్రంతో వాస్తు హోమం నిర్వహించారు. సమస్త మంగళవాయిద్యాలతో తెరను తొలగించి పొంగలి ముద్దలను, తెల్లాన్ని దేవస్థానం చాకలితో గోదావరిలో నిమజ్జనం చేయించారు. శనివారం సీతారామ, లక్ష్మణ స్వామివార్ల ఉత్సవ మూర్తులకు ఏకోత్తర సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. అలాగే రంగనాయకుల గుట్టపై వేంచేసి ఉన్న శ్రీరంగనాథ స్వామివారికి వార్షిక తిరుకల్యాణం జరుపనున్నారు. ఆదివారం నుంచి నిత్య కల్యాణం పునఃప్రారంభమవుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

### జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు


డిజిటల్ బోర్డుపై అవగాహన కల్పిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

బోనకల్లు, ఫిబ్రవరి 23 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం గోవిందాపురం-ఎల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన తరగతి గదులను పరిశీలిస్తూ.. విద్యాబోధన గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా డిజిటల్ బోర్డుపై విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ కేజీ టు పీజీ విద్యను అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అనేక విద్యా ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేసిందన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, దుస్తులు, కావాల్సిన సౌకర్యాలను కల్పించిన ఘనత కూడా గత కేసీఆర్ ప్రభుత్వానిదే దక్కిందన్నారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుల కొరత ఉన్నదని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే డీఈవోకు ఫోన్ చేసి పోస్టును భర్తీ చేయాలని ఆదేశించారు. వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిఘా నీడలో ఇంటర్మీడియట్ పరీక్షలు

### డీఐఈవో రవిబాబు



మాట్లాడుతున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 19వ తేదీ వరకు సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా నిర్వహించనున్నట్లు డీఐఈవో(జిల్లా ఇంటర్ విద్యాధికారి) కె. రవిబాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్(డీవో)లతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సీఎస్, డీవోలు కీలకమన్నారు. విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించి ఏమైనా లోపాలుంటే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు నడిపేలా, పరీక్షాకేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరీక్షల కోసం జిల్లాలో 70 కేంద్రాలు ఏర్పాటు చేయగా వీటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 26,578 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్, దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే పరీక్షల్లో నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమావేశంలో హైపవర్ కమిటీ డాక్టర్ కె శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సింహాచలం, వీరభద్రం పాల్గొన్నారు.

# ముత్యాల గుమ్మలే సమ్మక్క-సారక్క

## ఏజెన్సీకి ఆధ్యాత్మిక శోభ

### వన దేవతల చెంతకు భక్తజనం
### బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు




లక్ష్మీదేవిపల్లి: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


తిరుమలాయపాలెం: గద్దెల వద్ద పూజలు చేస్తున్న మహిళలు




కొత్తగూడెం అర్బన్: గద్దెల వద్ద పూజలు చేస్తున్న భక్తులు


కొత్తగూడెంలో..


టేకులపల్లి: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


చర్ల: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


మణుగూరు టౌన్: మణుగూరులో కిక్కిరిసిన భక్తజనం

లక్ష్మీదేవిపల్లి/కొత్తగూడెం అర్బన్/ తిరుమలాయపాలెం/ టేకులపల్లి/ చుంచుపల్లి/ చర్ల/ మణుగూరు టౌన్/ ఇల్లెందు రూరల్/ కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 23: వన దేవతల ఆగమనంతో అడవితల్లి పులకించింది. సమ్మక్క- సారక్క శరణు ఘోషతో వనం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. బంగారం (బెల్లం) సమర్పణ, ఊరేగింపులు, భక్తుల పూనకాలతో హోరెత్తింది. అచ్చమైన ఆదివాసీ పూజలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పునీతమైంది. భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని ఎదురు గుట్ట సమ్మక్క సారక్క సుంకు జాతరకు శుక్ర వారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. జిల్లా నుంచే కాక ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచీ భారీ గా భక్తులు తరలొచ్చారు. గణాచారులు సమ్మక్క-సారక్కను తిరిగి గుట్టకు చేర్చడంతో జాతర ముగిసింది. చుంచుపల్లి మండలం గౌతంపూర్ పంచాయతీ పరిధి లోని ఎర్రగడ్డ మినీ మేడారానికి భక్తులు భారీగా తరలొచ్చారు. డప్పు వాద్యాలు, గిరిజన పూజారుల పూనకాల నడుమ గురువారం రాత్రి నిర్వాహకులు అమ్మవార్లను వనం నుంచి గద్దెలపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. గద్దెలపై కొలువైన వన దేవతలను శుక్రవారం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. టేకులపల్లి మండల కేంద్రంతోపాటు పాలమడుగు, నర్సాయిగూడెం, మురుట్ల, రామచంద్రునిపేట, లక్ష్మీదేవిపల్లి మండలం లోని గడ్డిగుట్టలోనూ గ్రామస్తులు వన దేవతలకు పూజలు చేశారు. ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెంలోని సమ్మక్క- సారక్క గద్దెల వద్ద గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. మణుగూరు మండలం తోగ్గూడెం, కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామాటాకీస్ ఏరియాలో సమ్మక్క-సారక్క జాతరలకు పట్ట ణవాసులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి మినీ మేడారానికి జిల్లా నుంచే కాక పొరుగు జిల్లాలైన నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ నుంచీ వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు గ్రామస్తులు అన్నదానం చేశారు.


మణుగూరు టౌన్: మేడారం జాతరలో మాజీ ఎమ్మెల్యే రేగా


ఇల్లెందు రూరల్: గద్దెల వద్ద భక్తుల కోలాహలం


చుంచుపల్లి: అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# 'పేట'కు 'న్యాయం'!


దమ్మపేటలో కోర్టు ఏర్పాటుకు సిద్ధమైన భవనం

- దమ్మపేటలో జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు
- ఇల్లెందు నుంచి ఇక్కడికి తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే కోర్టు ఏర్పాటుకు నిర్ణయం
- న్యాయస్థానం కోసం భవనం కూడా ఎంపిక
- నెరవేరిన మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా' కల

అశ్వారావుపేట, ఫిబ్రవరి 23 : మండల ప్రజలకు న్యాయ సేవలు మరింతగా దగ్గరయ్యాయి. నియోజకవర్గంలోనే రెండో పెద్ద మండలమైన దమ్మపేటలో కోర్టు(న్యాయస్థానం) ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. న్యాయస్థానం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఉండడం.. కేసుల విషయంలో నిత్యం అక్కడికి వెళ్లాల్సి రావడం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఈ అంశాన్ని అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆనాటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిన మెచ్చా ఇందుకు అవసరమైన భవనాన్ని సైతం ఎంపిక చేశారు. అధికారులు కోర్టు ఏర్పాటుకు వసతులు కూడా కల్పించారు.

### కొత్త జిల్లాల ఏర్పాటుతో దగ్గరైన పాలన

ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రధాన శాఖలు కొత్తగూడెం జిల్లాలోకి వెళ్లాయి. ఈ క్రమంలో అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.. ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సహకారంతో అశ్వారావుపేటలోనే అన్ని ప్రభుత్వ ప్రధాన శాఖల సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్క కోర్టు భవనం సిద్ధమైనా ఇల్లెందు నుంచి తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రావడం ఆలస్యమైంది. తాజాగా ఈ నెల 22న లీగల్ ఎఫైర్స్, లెజిస్లేటివ్ ఎఫైర్స్ అండ్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కార్యాలయం నుంచి జీవో 99ని జారీ చేశారు. ఇల్లెందులో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి అండ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును దమ్మపేటకు బదిలీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోర్టు తరలింపునకు అనుమతి రావడంతో అధికారులు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కోర్టు ప్రారంభం కాగానే నియోజకవర్గ ప్రజలకు న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయి. మార్చి మొదటి వారంలో కోర్టు ఏర్పాట్లు పూర్తి కావొచ్చని అధికారులు భావిస్తున్నారు.

### ప్రజావసరాలకు ప్రాధాన్యమిచ్చాను : మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే



గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రంలో ఉండాల్సిన ప్రధాన ప్రభుత్వ శాఖల సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చాను. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పుడు కోర్టును దమ్మపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ జీవో జారీ చేయడంతో ఆ కల కూడా నెరవేరింది.

# ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు


ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

- ప్రజలు 'ప్రైవేట్'కు వెళ్లి నష్టపోవద్దు
- సిబ్బంది అలసత్వం వహిస్తే సహించం
- కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల వైద్యులను ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్ర ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు వార్డులను పరిశీలించారు. తొలుత ఎమర్జెన్సీ వార్డును సందర్శించి వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా.. మందులు ఇస్తున్నారా.. ఎన్నిరోజుల నుంచి ఆస్పత్రిలో ఉన్నారు.. తదితర వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో రోగులను డాక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆర్థోపెడిక్, ఇంటెన్సివ్ కేర్‌ను సందర్శించి అక్కడ రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టోర్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరు రికార్డులను పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూరుశాతం హాజరు ఉండాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధి పనులు ఎంతవరకు జరిగాయో సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి వెలుపల డ్రైనేజీ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. వారంరోజుల్లో ఆస్పత్రిలో ఉన్న పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఆస్పత్రి ఏవోను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శిరీష, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావు, ఆర్‌ఎంవో జీజీహెచ్ డాక్టర్ పుష్పలత, ఆర్‌ఎంవో ఎంసీహెచ్ రామవరం డాక్టర్ వీరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్ర, ఆస్పత్రి అన్ని విభాగాల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

### వైద్యులపై కలెక్టర్ సీరియస్

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వైద్యులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. గంటసేపు వార్డులను పరిశీలించిన ఆమె రెండుగంటలపాటు అన్ని విభాగాల వైద్యులతో సమీక్ష నిర్వహించారు. పనితీరు మార్చుకోవాలని వైద్యులను హెచ్చరించారు. ఆసుపత్రి నిర్వహణ బాగా లేదని, అన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఆసుపత్రి ఏవో విజయభాస్కర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ దూడల బుచ్చయ్య ఆసుపత్రి అపరిశుభ్రతపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే ఆమె స్పందిస్తూ వారంరోజుల్లో సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. రామవరం మాతా శిశుకేంద్రంలో తల్లీబిడ్డ మృతిపై నివేదిక ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మళ్లీ వారంరోజుల్లో ఆసుపత్రికి వస్తానని మార్పు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 11 గంటలకు వచ్చిన ఆమె 2 గంటల వరకు ఆసుపత్రిలోనే సమీక్ష చేసి వైద్యుల పనితీరు పరిశీలించారు.